క్లుప్తంగా

జిల్లాస్థాయి క్రికెట్ విజేత ముసలిమడుగు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామంలో ఈస్టర్ పర్వదినం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి ముసలిమడుగు జట్టు గెలుచుకున్నట్లు నిర్వాహకులు విష్ణు, మహేష్, వెంకట్, రమేష్ తెలిపారు. సోమవారం జముసలిమడుగు బీసీ జట్టు, ముసలిమడుగు ఎస్సీ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో ఎస్సీ జట్టుపై బీసీ జట్టు విజయం సాధించి మొదటి బహుమతి రూ.20,016 కైవసం చేసుకుంది. పోటీల్లో దాదాపు 23 టీములు పాల్గొన్నాయి. రెండో బహుమతి రూ 10,016 లతో పాటు కప్‌ను ముసలిమడుగు ఎస్సీ జట్టుకు నిర్వహకులు అందజేశారు.

తోపుడు బండ్లు ఇప్పించండి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని సున్నిపెంట చెంచుకాలనీకి చెందిన గిరిజనులు తమకు తోపుడు బండ్లు ఇప్పించాలని సోమవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజనులు ప్రాజెక్ట్ అధికారిని కలిశారు. మేకలబండలోని గిరిజనులు గతంలో ఐటీడీఏ కార్యాలయం పరిధిలో తాత్కాలిక ఉద్యోగాలు చేశామని, ఆయా కాలానికి రావాల్సిన జీతాలు బకాయి ఉన్నాయని, వాటిని చెల్లించాలని కోరారు. వివిధ చెంచుగూడేల నుంచి వ్యవసాయ బోర్లు వేయించాలని ఉపాధికి మార్గాలు చూపించాలని, రుణాలు అందించాలని పలు విజ్ఞాపనలు స్పందన కార్యక్రమంలో అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చెక్కు అందజేస్తున్న ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి

మిడుతూరు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ కల్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకున్న వీపనగండ్ల గ్రామానికి చెందిన గద్దల శ్యామలమ్మకు మంజూరైన రూ.లక్ష చెక్కును అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్నామన్నారు. అర్హులైన వారు కళ్యాణమస్తుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి, ఏఓ దశరథరామయ్య, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: జీసీపాలెం మజరా గ్రామమైన నెమిళ్లకుంటలో సోమవారం నాటు సారా స్థావరాలపై సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ అడిషనల్ ఎస్పీ రమణ ఆధ్వర్యంలో సీఐ నాగమణి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రెండు నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. 4 వేల లీటర్ల బెల్లం ఊటను పారబోసి, 50 లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు. నాటుసారా తయారు చేయడం కానీ, విక్రయించడం కానీ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఏఈఎస్ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కూల్‌డ్రింక్



విద్యార్థులకు పానీయం అందిస్తున్న దృశ్యం

పాములపాడు: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు దాతలు చల్లని పానీయాలు అందిస్తున్నారు. సోమవారం పాములపాడు మాజీ సర్పంచు విజయసింహారెడ్డి ఆరంజ్ రసం పంపిణీ చేశారు. ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండతీవ్రత ఎక్కువగా ఉందన్నారు. ఇలాంటి సమయంలో పరీక్ష రాసి బయటకు వచ్చిన విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి చల్లని పానీయాలు అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండ్లమూరి వెంకటేశ్వరరావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎ.కోడూరులో ఇఫ్తార్ విందు

బండిఆత్మకూరు: ఎ.కోడూరు గ్రామంలో మాజీ సర్పంచ్ ఒడ్డు వెంకటసుబ్బారెడ్డి కుమారుడు మధుసుదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. సుమారు వంద మంది ముస్లింలకు భోజనాలు ఏర్పాటు చేశారు.

పచ్చని చెట్లకు నిప్పు



మండ్లెం సమీపంలో కేజీ రోడ్డు పక్కన నిప్పుపెట్టడంతో వాడిపోయిన పచ్చని వృక్షాలు

- ఎండిపోయాక గుట్టుచప్పుడు కాకుండా నరికివేత
- కలప డిపోల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న దుండగులు
- కర్నూలు–గుంటూరు రహదారి వెంట కనుమరుగవుతున్న వృక్షాలు



వృక్షాల మొదళ్లకు నిప్పుపెట్టి కాల్చిన దృశ్యం

జూపాడుబంగ్లా: రెండు, మూడేళ్ల క్రితం వరకు నందికొట్కూరు నుంచి జూపాడుబంగ్లా వరకు కేజీ రోడ్డుకు ఇరువైపులా పచ్చని వృక్షాలతో ప్రయాణం ఆహ్లాదకరంగా ఉండేది. వేసవిలో ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోల్లో వెళ్లే ప్రయాణికులు అక్కడక్కడ చెట్లకింద కూర్చొని భోజనాలు, అల్పాహారం తిని సేదతీరేవారు. అయితే కొందరు స్వార్థపరులు ధనార్జనే ధ్యేయంగా పచ్చని వృక్షాలకు నిప్పుపెట్టి వాటిని బలితీసుకుంటున్నారు. వాటిని గుట్టుచప్పుడు కాంకుండా నరికేసి, టింబర్ డిపోల్లో విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు.

ప్రస్తుతం పదుల సంఖ్యలో వృక్షాలు..

కేజీ రోడ్డు వెంట ఉన్న వృక్షాలను రక్షించేందుకుగాను గతంలో రోడ్లు, భవనాలశాఖ అధికారుల అధ్వర్యంలో వృక్షాలకు నంబర్లు వేసి రంగులు పూశారు. క్రమేణా రోడ్డుకు ఇరువైపుల ఉన్న వృక్షాలపై పర్యవేక్షణ కొరవడటంతో దాన్ని స్వార్థపరులు ఆసరాగా చేసుకొని చెట్ల మొదళ్ల యాసిడ్ పోయడం, నిప్పుపెట్టడం ప్రారంభించారు. దీంతో పోషకాలు అందక పచ్చని చెట్లు ఎండిపోతున్నాయి. వాటిని గుట్టుచప్పుడు కాకుండా నరికివేసి కలపడిపోల్లో అమ్మేస్తున్నారు.గతంలో నందికొట్కూరు నుంచి జూపాడుబంగ్లా వరకు సుమారు 200 వృక్షా లు ఉండగా ప్రస్తుతం పదులసంఖ్యలో వృక్షాలు ఉన్నాయి.

కనుమరుగైన భారీ వృక్షాలు

మండ్లెం పుల్లయ్య బావి సమీపంలో కేజీ రోడ్డుకు ఇరువైపుల భారీ వృక్షాలు ఉండి ప్రయాణికులకు ఏమాత్రం ఎండ తగలకుండా ఓ సొరంగంలో ప్రయాణించినట్లుగా ఉండేది. ప్రస్తుతం అక్కడ ఉన్న భారీ వృక్షాలు కనుమరుగయ్యాయి. అలాగే తంగడంచ చెక్‌పోస్టు నుంచి పారుమంచాలకు వెళ్లే దారి వెంట రోడ్డుకు ఇరువైపుల వందలాది వృక్షాలను అటవీశాఖ అధికారులు, డ్వామా అధికారులు నాటించారు. అవి పెరిగి పెద్దవ్వటంతో కొంత మంది స్వార్థపరులు వాటకి కూడా నిప్పుపెట్టి నిలువునా కాల్చేస్తున్నారు. అటవిశాఖ, రోడ్లు, భవనాలశాఖ అధికారులు చర్యలు తీసుకొని కేజీ రోడ్డు, పారుమంచాల రోడ్డు వెంట ఉన్న పచ్చని వృక్షాలను కాపాడాలని ప్రకృతి ప్రేమికులు, ప్రయాణికులు, బాటసారులు కోరుతున్నారు.

సేదతీరేందుకు వీల్లేకుండా పోయింది



నాకు ఏ అవసరం వచ్చినా మా ఊరి నుంచి బైక్‌పై నందికొట్కూరు, జూపాడుబంగ్లాకు వెళ్లొస్తుంటాను. ఎండల తీవ్రత నుంచి తప్పించుకునేందుకు కాసేపు రోడ్డు పక్కన చెట్టు కింద నిల్చుందామంటే వీల్లేకుండా పోయింది. నందికొట్కూరు నుంచి జూపాడుబంగ్లా వరకు కేజీ రోడ్డు వెంట గతంలో చెట్లు అధికంగా ఉండేవి. క్రమేణా చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. పారుమంచాల రోడ్డు వెంట కూడా చెట్లు అధికంగా నరికివేతకు గురవుతున్నాయి. చెట్లను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– దొడ్డా సుధాకర్, తూడిచెర్ల

చెట్లు నరికివేతకు గురికాకుండా కాపాడాలి



వాహనాల రాకపోకల వల్ల వెలువడే కాలుష్యం నుంచి ప్రయాణికులకు చెట్లు ఎంతగానో విముక్తిని కలిగిస్తాయి. ప్రయాణం ఆహ్లాదరకంగా కలిగేలా చేస్తాయి. అలాగే ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు, కార్లు, ఆటోల్లో వెళ్లే వారు కాస్త సేదతీరే అవకాశం లభిస్తుంది. స్వార్థపరుల గొడ్డలి వేటుకు రోడ్లవెంట ఉన్న వృక్షాలు బలికాకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

– గోపాల్, ఫ్రెండ్స్‌హెల్ప్ యూత్, జూపాడుబంగ్లా

చెట్లు నరికే వారి వివరాలు చెబితే చర్యలు

రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్లకు నిప్పుపెట్టి నరికివేస్తున్న వారి వివరాలు తెలియజేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. చెట్లు నరికివేతకు గురికాకుండా పరిరక్షిస్తాం. వర్షాకాలంలో అక్కడక్కడ చెట్లు నాటించేందుకు చర్యలు తీసుకుంటాం.

– నాగస్వామి, జేఈ, ఎన్‌హెచ్ 340సీ

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు,అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీన్నులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

అమ్మవారికి గాజుల సమర్పణ



అమ్మవారికి పట్టువస్త్రాలు, గాజులు సమర్పించడానికి వస్తున్న భక్తబృందం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి మంగళవారం జరగనున్న కుంభోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లెకు చెందిన భక్తబృందం సభ్యులు స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు, అమ్మవారికి గాజులు సమర్పించారు. గాజులు తయారీ ప్రసిద్ధమైన జంగాలపల్లి నుంచి ఏటా కంచి కామాక్షిదేవి, మధుర మీనాక్షిదేవి, తిరుచానూరు పద్మావతి దేవి, శ్రీశైల భ్రమరాంబా దేవికి ఉత్సవాల సందర్భంగా వస్త్రాలు, గాజులను సంప్రదాయబద్ధంగా సమర్పిస్తున్నట్లు భక్తబృందం సభ్యులు తెలిపారు.

రేపు తర్తూరు హుండీ ఆదాయం లెక్కింపు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి, అమ్మవార్ల హుండీల ఆదాయాన్ని ఈనెల 12న లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతనెల 29 నుంచి ప్రారంభమైన శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో హుండీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్, గ్రామస్తులు, భక్తుల సమక్షంలో లెక్కించనున్నట్లు తెలిపారు.

మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: ఎంతో ప్రతిష్టాత్మకంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొనే తర్తూరు జాతరలో మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని తర్తూరు సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొంత మంది స్వార్థపరులు ధనార్జనే ధ్యేయంగా అక్రమంగా మద్యం విక్రయిస్తూ సొమ్ముచేసుకొంటున్నా పోలీసులు ఉదాసీనతగా వ్యవహరించటం తగదన్నారు. అలాగే కొంత మంది అక్రమ మద్యం విక్రయాల కోసం తనపేరును బదలాం చేస్తున్నారని, తనకు మద్యం విక్రయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఎవ్వరైనా తనపేరును అడ్డుపెట్టుకొని అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడితే సహించేదిలేదన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలో తాగునీటి చలివేంద్రాన్ని సర్పంచ్ మాధవరం ప్రకాశం సోమవారం ప్రారంభించారు. చలివేంద్రంలో మంచినీటితో పాటు మజ్జిగను కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్ణ, రసూల్, రాములు, చిన్నపుల్లయ్య, ఏసన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో వెలసిన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు సోమవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రకారాల్లో పల్లకీ సేవా వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో వేదపండితులు రవిశంకర అవధాని, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భక్తుల సందడి

మహానందిలో సోమవారం భక్తుల సందడి కొనసాగింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్థానిక కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం కొనసాగింది.

'జగనన్నే మా భవిష్యత్తు'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య

మిడుతూరు: జగనన్నే మా భవిష్యత్తు – జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలోని రఘురామయ్య స్వగృహంలో మండలస్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్నే మా భవిష్యత్తు – జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని చెప్పారు. అనంతరం జగనన్న మా భవిష్యత్తు సంబంధించిన సామగ్రిని మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు రామతులశమ్మ, చౌట్కూరు సర్పంచ్ మదార్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సల్కోటీ గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి, కమతం వీరారెడ్డి, గోపు చంద్రశేఖర్‌రెడ్డి, పేరెడ్డి శ్రీనివాసరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో సమస్యలు పరిష్కరించుకోండి

జూపాడుబంగ్లా: ప్రజలు వారి వ్యక్తిగత, గ్రామాల్లోని సమస్యలను లిఖితపూర్వకంగా స్పందనలో తెలియజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. సోమవారం జూపాడుబంగ్లా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో మండలంలోని వివిధశాఖల అధికారుల అధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈఓపీఆర్డీ మణిమంజరి, ఏఈలు బషీర్, ఎంఈఓ మోహన్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం అమలు చేస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాల్గొన్నారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఆత్మకూరు: రాష్ట్రంలో రాజకీయ ఆర్థిక, సామాజిక పరంగా అన్ని రంగాల్లో వెనుకబడిన బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మికి సంఘం నాయకులు రమణ, వెంకటరాముడు, పాలశివ, వెంకటేశ్వర్లు, నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు శంకర్, మల్లి, నారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ
- సీఎం జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం



నందికొట్కూరులో సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, పొదుపు మహిళలు



హాజరైన పొదుపు మహిళలు



పగిడ్యాల కోట వీధిలోని రమణయ్య శెట్టి ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: మహిళలు ఆర్థికంగా రాణించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో మొత్తం 4, 072 గ్రూపుల సభ్యులకు రూ.27.29 కోట్లు వైఎస్సార్ ఆసరా పథకం కింద జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పట్టణంలో 706 గ్రూపులకు 4.39 కోట్లు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇచ్చిన హామీలను 90 శాతం వరకు అమలు చేసి చరిత్ర సృష్టించారని గుర్తు చేశారు. అనంతరం సీఎం జగనన్న చిత్ర పటానికి ఎమ్మెల్యే, పొదుపు మహిళలు పాలాభిషేకం చేశారు. అలాగే మెగా చెక్కును పొదుపు మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షకూర్, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, టౌన్ సీఐ విజయభాస్కర్, సహకార సొసైటీ అధ్యక్షుడు హుసేనయ్య, కౌన్సిలర్లు సుమలత, ధర్మారెడ్డి, జాకీర్ హుసేన్, మెప్మా టీఎం సీ శాంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు వనజ, సుధాకర్‌రెడ్డి, చిన్న నాగన్న, మహేష్, ఆర్ట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచుల పెద్దన్నయ్య మన జగనన్న

పగిడ్యాల: అక్కాచెల్లెమ్మలా ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ నవరత్నాల పథకం ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దన్నయ్యలా నిలిచాడని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో చేపట్టిన వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నందికొట్కూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల కంటే పగిడ్యాల మండలంలోనే 756 పొదుపు గ్రూపులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అత్యధికంగా రూ. 6,82,19,172 మంజూరు కావడం హర్షణీయమన్నారు. అనంతరం పొదుపు మహిళల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మెగా చెక్కును పంపిణీ చేశారు.

కోటా వీధిలో 'జగనన్నే మా భవిష్యత్'

స్థానిక కోట వీధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా పదిహేను గృహాలను సందర్శించి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని వారి గృహాలకు జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను అంటించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీటీసీ పగడం గోపాల్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమణ, నందికొట్కూరు సింగిల్‌విండో చైర్మన్ ఉసేనయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, పల్లె సత్యనారాయణరెడ్డి, చిట్టిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పాస్‌బుక్కులివ్వాలి

ఆత్మకూరు: నందికొట్కూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పేద రైతులు సాగు చేస్తున్న అసైన్‌మెంట్ భూములకు పట్టాదారుల పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని బీఎస్పీ నందికొట్కూరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ స్వాములు కోరారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ దాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటూ పేదల పంటలు వేస్తున్నారని, అయితే వీరికి పాస్ పుస్తకాలు మంజూరు చేయలేదన్నారు.

స్టేషన్‌కు చేరిన వివాహిత మృతి పంచాయితీ

పగిడ్యాల: చికెన్ పాక్స్(తట్టు) సోకి తీవ్ర జ్వరం బారినపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిన ఓ వివాహిత పంచాయతీ సోమవారం ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌కు చేరింది. స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం బుడగ జంగాల కాలనీకి చెందిన మాధవి(28) దాదాపు రెండు వారాలుగా చికెన్ పాక్స్(తట్టు) సోకి తీవ్ర జ్వరం బారినపడింది. ఆమె భర్త రామాంజనేయులు మెరుగైన వైద్యం కోసం మూడు రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు శంకరప్ప, బంధువులతో వెళ్లి భర్త రామాంజనేయులు, మరిది బాలాంజనేయులు, అత్తమామలు లక్ష్మీదేవి, రాముడులపై దాడికి పాల్పడి నానా రభస చేసి, పిల్లల పేర ఆస్తి రాయాలని పట్టుబట్టారు. అలాగే తమ కూతురు మృతిపై కూడా అనుమానం ఉందని స్టేషన్‌ను ఆశ్రయించారు. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి హంగామా చేశారు. తమ కూతురికి వినయ్‌కుమార్, వరుణ్‌తేజ్ ఇద్దరు మగపిల్లలు ఉన్నారని, వారి పేరు మీద రెండేకరాల భూమి రాసే వరకు అంత్యక్రియలు నిర్వహించరాదని వాదనకు దిగాడు. దీంతో రామాంజనేయులు తల్లిదండ్రులు భూమి రాసి ఇచ్చేందుకు ఒప్పుకోవడంతో అనుమాన మృతి కథ సుఖాంతమైంది. ఈ విషయమై ముచ్చుమర్రి పోలీసులను అడుగగా మృతురాలి బంధువులు స్టేషన్‌కు వచ్చిన సంగతి వాస్తవేమనని, పిల్లల పేర భూమి రాయించాలని పంచాయతీ పెడితే బయట చేసుకోవాలని పంపివేశామని ఎస్ఐ నాగార్జున తెలిపారు.

అవినీతికి తావులేకుండా పాలన



మిడుతూరులో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న సొసైటీ చైర్మన్ నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి

మిడుతూరు: రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, నందికొట్కూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను విడుదల చేశారు. అనంతరం బీసీ కాలనీలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఇళ్ల మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ మౌలాలి, పైపాలెం సర్పంచ్ రామచంద్రుడు, మాజీ సర్పంచ్ పేరెడ్డి నారాయణరెడ్డి, పేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మల్లు శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు తోడుగా ఉందాం

పాములపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడు నీడగా ఉండి సంతోషంగా జీవిద్దామని సొసైటీ చైర్మన్ చౌడయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 2వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై అభిప్రాయాలను తెలుసుకున్నా. ప్రభుత్వం పాలన పై సంతృప్తి అనిపిస్తే మీ ఇంటికి స్టిక్కర్ అతికిస్తామని చెప్పి ప్రజల అనుమతితో ఆ ఇంటికి స్టిక్కర్ అంటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు రాములమ్మ, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నను ఆశీర్వదించండి

జూపాడుబంగ్లా: వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ గద్దం హనుమంతరెడ్డి, గృహసారథులు లక్ష్మీదేవి, చిన్నరంగస్వామిరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని తర్తూరు గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు వివరించారు.

ప్రజల సంపూర్ణ మద్దతు వైఎస్సార్‌సీపీకే

వెలుగోడు: మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంతో ప్రజల సంపూర్ణ మద్దతు వైఎస్సార్ సీపీ వైపే ఉందన్న విషయం తేటతెల్లమవుతుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుంపరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నాలుగో రోజు కొనసాగింది. రేగడగూడురు గ్రామంలో జేసీఎస్ కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు ఇంటింటా పర్యటించి వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

ఊరూరా 'మా నమ్మకం నువ్వే జగన్'

ఆత్మకూరు: పట్టణంలోని14వ వార్డులో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, వరాల మాలిన్, పాన్‌బాషా, మహ్మద్‌హుస్సేన్ మండలంలోని శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం, నల్లకాల్వ, బాపనంతపురం, వడ్లరామాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు ఆయా గ్రామాల నాయకులు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, జేసీఎస్ కన్వీనర్ జయశంకర్‌రెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 8వ వార్డులో మోతుల్లా, బాషా, ముర్తుజా, నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ వాణి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

మహానంది: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సంక్షేమ పాలన సాధ్యమని గాజులపల్లె వైఎస్సార్‌సీపీ నేత కొండా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం గాజులపల్లెలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.